కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి సందర్భంగా...

# లెనినిజం చిరస్థాయి అగుగాక!



**("లెనినిజం చిరస్థాయి అగుగాక" అనేది, కామ్రేడ్ లెనిన్ 90వ జయంతి సందర్భంగా, నాటి ప్రపంచ కమ్యునిస్ట్ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళ నేపథ్యంలో 'పెకింగ్ రివ్యూ' సంపాదక వర్గం1960లో ప్రచురించిన పత్రం.**

**ఒకవైపున లెనినిజం యొక్క విశిష్టతను పొగుడుతూ, దాని విప్లవ చేవని పల్చన చేసి, వర్గ పోరాట పంథాను దిగజార్చి, కార్మికవర్గ చైతన్యాన్ని పక్కదారి పట్టించే అవకాశవాద రివిజనిస్టు అవగాహనలను ఎత్తిచూపే పత్రం "పెకింగ్ రివ్యూ" పత్రికలో (1960 ఏప్రిల్ 26న) వెలువడింది. దీని రూపకర్తలు చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'రెడ్ ఫ్లాగ్' సంపాదకవర్గం. ఇది 1960లోనే, అంటే 63 సంవత్సరాల క్రితమే, తెలుగు భాషలోకి అనువాదమై కమ్యూనిస్టు శ్రేణులలో మౌలికమైన సైద్ధాంతిక ఆలోచనలను రేకెత్తించింది.**

**కామ్రేడ్ లెనిన్ శతవర్ధంతి (21 జనవరి 2024) సందర్భంగా 6 భాగాలుగా ఉన్న ఈ చారిత్రక పత్రాన్ని, కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు అర్థం చేసుకుని నేటి పరిస్థితులకు అన్వయించుకుంటారని ఆశిస్తూ 'లెనినిజం చిరస్థాయి అగుగాక!' పత్రంలోని చివరి రెండు భాగాలను ఇపుడు అందిస్తున్నాం. - సంపాదకులు)**

## 5

**అక్టోబరు** విప్లవం తర్వాత 1919లో లెనిన్ రెండవ అంతర్జాతీయ కార్మిక సమాఖ్య నుండి నేర్చుకోవలసిన గుణపాఠాలను తెలియ జేశారు. రెండవ అంతర్జాతీయ కార్మిక సమాఖ్య పనిచేసిన దశలో శ్రామికోద్యమం బాగా విస్తరించినప్పటికీ దాని విప్లవ స్థాయి తాత్కాలికంగా పడిపోయింది: అవకాశవాదం యొక్క ప్రాబల్యం తాత్కాలికంగా పెరిగింది. దాని ఫలితంగానే యీ సమాఖ్య చివరకు అప్రతిష్టాకరంగా కూలిపోయింది. (మూడవ అంతరాతీయ కార్మిక సమాఖ్య: చరిత్రలో దాని స్థానం సెలెక్టెడ్ వర్క్స్-1952, మాస్కో ప్రచురణ, రెండవ సంపుటి, మొదటిభాగం 199వ పేజీ నుండి)

అవకాశవాదం అంటే అర్థమేమిటి? "అవకాశవాదం అంటే తాత్కాలికమైన పాక్షికమైన ప్రయోజనాల కోసం, కీలక ప్రయోజనాలను బలి యివ్వడం" అని లెనిన్ తెలియజేశారు. (మాస్కో పార్టీ శాఖకు సంబంధించిన మిలిటెంట్ల సమావేశంలో ప్రసంగం కలెక్టెడ్ వర్క్స్, 4వ రష్యన్ కూర్పు, 31వ సంపుటి, 412వ పేజీ నుండి)

ఇక విప్లవస్థాయి పడిపోవడమంటే ఏమిటి? అవకాశవాదులు ప్రజల దృష్టిని తాత్కాలిక, దైనందిన, పాక్షిక ప్రయోజనాల మీదికి మరల్చి వారి దీర్ఘకాల, మౌలిక సమగ్ర ప్రయోజనాలను విస్మరించి, తదనుగుణంగా ప్రజలకు నాయకత్వం వహిస్తే అప్పుడు విప్లవ స్థాయి పడిపోయిందంటాం.

ప్రజల దీర్ఘకాల, మౌలిక, సమగ్ర ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంటరీ పోరాటాలను పరిశీలించాలని మార్క్సిస్టు లెనినిస్టులంటారు.

పార్లమెంటరీ పోరాటాల పరిమితుల్ని లెనిన్ వివరించారు. దానితోపాటు సంకుచితమైన సెక్టేరియన్ పొరపాటు చేయవద్దని కమ్యూనిస్టులను హెచ్చరించారు. "అతివాద కమ్యూనిజం బాల్యారిష్టం" అను ప్రఖ్యాత గ్రంథంలో ఆయన రష్యన్ విప్లవం యొక్క అనుభవాన్ని పురస్కరించుకొని పార్లమెంటును ఎట్టి పరిస్థితుల్లో బహిష్కరించడం సరైనదో, ఎట్టి పరిస్థితుల్లో సరి అయినది కాదో తెలియజేశారు. ప్రతి శ్రామికవర్గ పార్టీ పార్లమెంటరీ పోరాటాల్లో పాల్గొనడానికి గల అవకాశాలు అన్నింటిని వినియోగించుకోవాలనేది లెనిన్ అభిప్రాయం. కమ్యూనిస్టుపార్టీ సభ్యులు కష్టాలకోర్చి పట్టుదలతో పనిచేయడానికి ఇష్టపడకుండా పార్లమెంటరీ పోరాటాలను తూలనాడుతూ, విప్లవాన్ని గురించి కబుర్లు చెబుతూ కూర్చుంటే శ్రామిక విప్లవానికి హాని చేసిన వారవుతారు, అది పూర్తిగా తప్పు ధోరణి.

కొన్ని యూరపియన్ దేశాల్లోని కమ్యూనిస్టుల విషయం ప్రస్తావిస్తూ. పార్లమెంట్లలో పాల్గొనకపోవడం పొరబాటని లెనిన్ విమర్శించారు. ఆయన యిలా చెప్పారు:

"పార్లమెంట్లలో పాల్గొనడాన్ని 'తిరస్కరించే' వారి బుద్ధిమాంద్య మెక్కడుందంటే, కార్మికోద్యమం లోపల ఉండే బూర్జువా ప్రజాతంత్ర ప్రభావాలను వారు యిట్టి 'సులభమైన,' 'సూటియైన,' పైకి విప్లవకరమైన పద్ధతుల ద్వారా ఎదుర్కోగల మనుకొంటారు. నిజానికి వారు తమ నీడను చూచి భయపడి పారిపోతున్నారు. కష్టాలు చూచి కళ్ళు మూసుకొంటున్నారు; కేవలం మాటలతో వాటిని పారద్రోలడానికి ప్రయత్నిస్తున్నారు" (లెనిన్ సెలక్టెడ్ వర్క్స్ : రెండవ సంపుటి, రెండవ భాగం, 443వ పేజీ).

పార్లమెంటరీ పోరాటాల్లో పాల్గొనవలసిన అవసరమేమిటి? కార్మికోద్యమం లోపల బూర్జువా ప్రభావాల నెదుర్కొనేందుకు లెనిన్ యిలా చెప్పారు.

"తన వర్గంలోనే ఉన్న వెనుకబడిన సెక్షన్లను ఎడ్యుకేట్ చేయడానికి, అభివృద్ధి చెందని, అట్టడుగున ఉన్న, అజ్ఞానాంధ కారంలో ఉన్న గ్రామీణ ప్రజల్ని మేల్కొలిపి విజ్ఞానవంతుల్ని చేయడానికీ...." (రెండవ సంపుటి, రెండవ భాగం. 383వపేజీ.)

మరో విధంగా చెప్పాలంటే, పార్లమెంటరీ పోరాటాల ఉద్దేశ్యం ప్రజల రాజకీయ, సిద్ధాంత స్థాయిని పెంచడం; పార్లమెంటరీ పోరాటాలను, విప్లవ పోరాటాలను సమన్వయ పరచడం. అంతేగాని మనకున్న రాజకీయ సిద్ధాంత స్థాయిని దిగజార్చడానికి కాదు; పార్లమెంటరీ పోరాటాలను విప్లవ పోరాటాలను వేరు పరచడానికి కాదు.

ప్రజలతో మనం అతి సన్నిహితంగా ఉండాలి, కానీ, విప్లవ ప్రమాణాలను ఏమాత్రం దిగజార్చకూడదు – ఈ మూల సూత్రానికి కట్టుబడి ఉండాలని లెనిన్ మనకు బోధించారు.

పార్లమెంటరీ పోరాటాలలో మనం తప్పక పాల్గొనవలసిందే; కానీ, బూర్జువా పార్లమెంటరీ విధానం పట్ల ఎట్టి భ్రమలూ పెట్టుకోరాదు. ఎందుచేతంటే, బూర్జువా వర్గం యొక్క సైనిక వ్యవస్థ, అధికారివర్గ దొరతనం చెక్కుచెదరకుండా ఉన్నంతకాలం పార్లమెంటు, సొగసైన బూర్జువా నియంతృత్వంగానే ఉంటుంది. పార్లమెంటులో కార్మికవర్గ పార్టీకి మెజారిటీ ఉన్నా లేక అన్నిటికంటే పెద్దపార్టీగా ఉన్నా జరిగేది యిదే.

అంతే కాదు; అట్టి రాజ్యాంగయంత్రం యధాతథంగా కొనసాగుతున్నంత కాలం, బూర్జువా వర్గం ఎప్పుడైనాసరే తన ప్రయోజనాలను కాపాడుకోడానికి అవసరమైతే పార్లమెంటును రద్దు చేయగలుతుంది; లేదా మెజారిటీ గల కార్మికవర్గ పార్టీని మైనారిటీ పార్టీగా మార్చేందుకు అనేక బహిరంగ, రహస్య పద్ధతుల వలంబించగల్గుతుంది; లేదా ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు తెచ్చుకొన్న కార్మికవర్గ పార్టీకి తక్కువ సీట్లు వచ్చేటట్లు చేయగల్గుతుంది. అందుచేత, పార్లమెంటులో వచ్చే ఓట్లను బట్టి బూర్జువా నియంతృత్వంలో మార్పులు వస్తాయనుకోవడం పొరబాటు. అలాగే శ్రామిక వర్గం పార్లమెంటులో ఎక్కువ ఓట్లు సంపాదించడం ద్వారా సోషలిజాన్ని శాంతియుత పద్ధతుల్లో సాధించవచ్చుననుకోవడం కూడ పొరబాటే. చాలాకాలం క్రిందటే పెట్టుబడిదారీ దేశాల్లో లభించిన అనేక అనుభవాలు ఈ విషయాన్ని రుజువు చేశాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అనేక యూరోపియన్, ఆసియన్ దేశాలలో జరిగిన ఘటనలు కూడా దీనినే రుజువు చేశాయి.

లెనిన్ యిలా చెప్పారు:

“శ్రామికవర్గం ప్రజల్లో అధిక సంఖ్యాకులని తన వైపు తిప్పుకోలేకపోతే విజయాన్ని సాధించలేదు. అయితే, బూర్జువా వర్గం పెత్తనంలో ఉండగా ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సంపాదించడానికే దీన్ని (ప్రజలలో అధిక సంఖ్యాకులను తన వైపు తిప్పుకోవడం–అను) పరిమితం చేయడం తెలివిహీనత అయినా కావాలి: కార్మికుల్ని మోసగించడమైనా కావాలి. (రాజ్యాంగ నిర్ణయసభ: శ్రామిక నియంతృత్వం” నుండి).

లెనిన్ చెప్పిన మాటలు ప్రస్తుత పరిస్థితులకు వర్తించవని ఆధునిక రివిజనిస్టులంటారు. కాని, అవి ఏ దేశంలోని విప్లవకారులకైనా సరే యిప్పటికీ చక్కని ఔషధమేనని (అయితే అది చేదుగా ఉండవచ్చు) వాస్తవ పరిస్థితులు రుజువుచేస్తున్నాయి.

విప్లవ ప్రమాణాలను కుదించటమంటే అర్థం మార్క్సిజం–లెనినిజం యొక్క సిద్ధాంత ప్రమాణాలను కుదించడమన్నమాట, రాజకీయ పోరాటాలను ఆర్థిక పోరాటాల స్థాయికి దించడమన్న మాట. విప్లవ పోరాటాలను పార్లమెంటరీ పోరాటాలకు పరిమితం చేయడమన్నమాట. తాత్కాలిక ప్రయోజనాలకై మూలసూత్రాలను బలియివ్వడమన్నమాట.

లెనిన్ 20వ శతాబ్దం ప్రారంభంలో వ్రాసిన “ఏం చేయాలి?” అను గ్రంథంలో మార్క్సిజం వ్యాప్తిచెందడంతో బాటు సిద్ధాంత స్థాయి కొంత తగ్గుతుంది,” అని వ్రాశారు. “మార్క్స్ గోథా కార్యక్రమం” పై వ్రాసిన లేఖను పేర్కొంటూ, ఆచరణకు సంబంధించిన ఉద్యమ లక్ష్యాలను సాధించేందుకు మనం ఒప్పందాలు చేసుకోవచ్చుననీ, అయితే మూలసూత్రాల విషయంలో వ్యాపారం చేయడం కూడదనీ, సిద్ధాంత సమస్యలపై ‘సౌకర్యాలు’ యివ్వరాదనీ లెనిన్ తెలియజేశారు. ఆ తర్వాత ఆయన వ్రాసిన క్రింది వాక్యాలు యించుమించు కమ్యూనిస్టులందరికి తెలుసు:

“విప్లవ సిద్ధాంతం లేనిదే విప్లవోద్యమం ఉండదు. అవకాశవాదాన్ని ఆకర్షవంతంగా బోధిస్తూ ఆచరణ విషయంలో అతి సంకుచితమైన రూపాలను అమలు జరుపుతున్న సమయంలో ఈ విషయాన్ని చాలగట్టిగా నొక్కి చెప్పవలసిన అవసరం ఉంది” (“ఏం చేయాలి?”: సెలెక్టెడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్, న్యూయార్క్, రెండవ సంపుటి. 47వ పేజీ).

మార్క్సిస్టు విప్లవకారులకిది ఎంత ప్రధానమైన కనువిప్పు! ఈ అవగాహనను ఆధారం చేసుకొనే రష్యాలో మొత్తం విప్లవోద్యమం 1917 అక్టోబరులో విజయం సాధించింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ కూడ యీ సమస్యపై రెండు సందర్భాల్లో అనుభవం సంపాదించింది. మొదటిది 1927 విప్లవ దశ. ఆ సమయంలో చైన్ త్సూసియూ కొమింటాంగ్ కమ్యూనిస్టు పార్టీల –ఐక్యసంఘటన పట్ల అనుసరించిన అవకాశవాద పంథా కమ్యూనిస్టు మూలసూత్రాలకే విరుద్ధమైనది. కమ్యూనిస్టు పార్టీని సిద్ధాంతరీత్యా కొమింటాంగ్ స్థాయికి దించాలని అతడు పట్టుబట్టాడు. ఫలితమేమంటే, విప్లవం పరాజయం పొందింది. రెండవసారి జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ప్రతిఘటన యుద్ధం కొనసాగుతున్న దశలో జరిగింది. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ మార్క్సిస్టు – లెనినిస్టు దృక్పథాన్ని చాల గట్టిగా బలపరచింది; జపాన్ వ్యతిరేక యుద్ధాన్ని నడిపే విషయంలో కమ్యూనిస్టు పార్టీ దృక్పథానికీ కొమింటాంగ్ దృక్పథానికీ మధ్యనున్న సిద్ధాంత విభేదాలను వివరించింది. ఆ దృక్పథాలలో కొంచెం కూడా సిద్ధాంత సంబంధమైన మినహాయింపులకు అంగీకరించకూడదని చెప్పింది. కాని వాంగ్ మింగ్ నాయకత్వం క్రింద కొందరు మితవాద అవకాశవాదులు చెన్ త్సూసియూ చేసిన తప్పులే చేశారు. కమ్యూనిస్టు పార్టీని

కొమింటాంగ్ స్థాయికి దిగజార్చాలని చూచారు. అందుచేత పార్టీ యావత్తూ మితవాద అవకాశవాదులతో బ్రహ్మాండమైన ఆంతరంగిక చర్చ జరిపింది. కామ్రేడ్ మావోసె టుంగ్ యీ సందర్భంలో ఇలా వ్రాశారు :

"…. కమ్యూనిస్టులు యీ సిద్ధాంత విషయాన్ని మరచిపోతే – జపాన్ వ్యతిరేక యుద్ధాన్ని వారు సక్రమంగా నడపజాలరు: కొమింటాంగ్ యొక్క ఏకపక్ష వైఖరిని ఓడించడంలో శక్తిహీనుల వుతారు; తమ సిద్ధాంతాలకు వ్యతిరేకమైన స్థితికి దిగజారుతారు! 'కమ్యూనిస్టు పార్టీని' కొమింటాంగ్ స్థాయికి దిగజారుస్తారు. అప్పుడు వారు మాతృదేశ రక్షణ, జాతీయ విప్లవ సమరం అనే పవిత్రాశయాలకు ద్రోహం చేసిన వారవుతారు." ("షాంఘై, తై యువాన్ల పతనం తర్వాత" : సెలక్టెడ్ వర్క్స్ – లారెన్స్ అండ్ విషార్ట్ ప్రచురణ, లండన్: రెండవ సంపుటి, 105 పుట).

మన పార్టీ కేంద్ర కమిటీ సిద్ధాంత సమస్యలపై ఏమాత్రం మినహాయింపుల కంగీకరించనందుననే, కొమింటాంగ్‌తో కలిసి ఐక్యసంఘటనలో పాల్గొంటున్నప్పుడు ఐక్యత, పోరాటం అనే విధానమనుసరించడం వల్లనే ఆర్థిక, రాజకీయ రంగాల్లో పార్టీ యొక్క స్థానాన్ని మనం పటిష్టమొనర్చగలిగాం: విస్తృత మొనర్చ గలిగాం. జాతీయ విప్లవ ఐక్యసంఘటనను పటిష్ఠమొనర్చి, విస్తృత మొనర్చగలిగాం: తత్ఫలితంగా జపాన్ వ్యతిరేక యుద్ధంలో ప్రజాశక్తుల్ని బలీయమొనర్చి, వ్యాప్తి చేయగలిగాం. జపాన్ వ్యతిరేక యుద్ధం సమాప్తమయ్యాక, చాంగ్ కై షేక్ అభివృద్ధి నిరోధకులు మనపై పెద్దయెత్తున ప్రారంభించిన దాడుల్ని తిప్పి కొట్టడంలోను, ప్రజావిజ్ఞానం దేశవ్యాపితంగా జయించేటట్లు చూడ్డంలోను కూడ అది మనకు తోడ్పడింది.

చైనా విప్లవం యొక్క అనుభవంచూస్తే శ్రామికవర్గం బూర్జువావర్గంతో రాజకీయంగా సహకరించేటప్పుడు పార్టీలో మితవాద పెడ మార్గం బయల్దేరే ప్రమాదం ఉంటుందనీ, రాజకీయంగా యీ రెండు వర్గాలు దూరమైనప్పుడు "అతివాద" పెడమార్గం బయల్దేరుతుందనీ గ్రహించవచ్చు. మన పార్టీ చైనా విప్లవాన్ని నడిపేటప్పుడు "అతివాద" పెడమార్గానికి వ్యతిరేకంగా పోరాటాలు జరిపింది. చైనాలోని సంక్లిష్టమైన వర్గ సంబంధాలను అర్థం చేసుకోవడంలోను, అన్వయించడంలోను "అతివాద" వీరులు మార్క్సిస్టు–లెనినిస్టు దృక్పథమవలంబించలేకపోయారు. విభిన్న చారిత్రక దశల్లో విభిన్న వర్గాల పట్ల సక్రమమైన– వేర్వేరు విధానాలను అవలంబించడమెలాగో అర్థం చేసుకోలేక పోయారు; ఐక్యతను విస్మరించి పోరాటం మీదనే తమ దృష్టిని కేంద్రీకరించేవారు. ఈ "అతివాద" దుందుడుకు పోకడను మన పార్టీ నిర్మూలించి యుండకపోతే, చైనా విప్లవం జయించడం అసాధ్యమైయుండేది.

లెనిన్ దృక్పథాని కనుగుణ్యంగా శ్రామిక వర్గం ఏ దేశంలోనైనా విజయవంతంగా నడపదలచుకొంటే, నిజమైన మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీ ఉండాలి. మార్క్సిజం–లెనినిజం అను విశ్వమానవ సత్యాన్ని తన దేశంలో నిర్దిష్టమైన విప్లవ ఆచరణతో సమన్వయ పరచగల నైపుణ్యం దానికుండాలి. వివిధ దశల్లో విప్లవాన్ని ఏ వర్గాలకు వ్యతిరేకంగా నడపాలో, ప్రధాన శక్తుల్నీ మిత్రవర్గాల్నీ ఎలా సంఘటిత పరచాలో తెలుసుకోవాలి. ఏయే వర్గాలమీద తాను ఆధారపడాలో, ఏ వర్గాలతో చేతులు కలపాలో నిర్ధారణ చేసుకోగలగాలి. శ్రామికవర్గం యొక్క విప్లవ పార్టీ తన వర్గానికి చెందిన జనబాహుళ్యం మీద, గ్రామీణ ప్రాంతాల్లోని అర్ధశ్రామికుల మీద – అంటే పేదరైతుల మీద – పూర్తిగా ఆధారపడుతూ శ్రామికవర్గ నాయకత్వం క్రింద కార్మిక – కర్షక ఐక్యతను నిర్మించాలి. ఆ తర్వాతనే, యీ ఐక్యత యొక్క ఆధారంమీద, ఏయే సాంఘిక శక్తులతో చేతులు కలపవచ్చునో వాటన్నిటితోను చేతులు కలపడం సాధ్యపడుతుంది. ఆవిధంగా కష్టజీవులు, కష్టజీవులు కానివారు కలిసి ఐక్యసంఘటనగా ఏర్పడటం సాధ్యపడుతుంది. ఇది వేర్వేరు దశల్లో వివిధ దేశాల్లోని పరిస్థితుల మీద ఆధారపడి యుంటుంది. శ్రామిక వర్గం యిలా చేయలేకపోతే వేర్వేరు దశల్లో విజయం సాధించలేకపోతుంది.

ఆధునిక రివిజనిస్టులు, కొందరు బూర్జువావర్గ ప్రతినిధులు శ్రామికవర్గ విప్లవ పార్టీ లేకపోయినా, పై విధమైన సక్రమ పాలసీలు "అవలంబింపబడకపోయినా సోషలిజాన్ని సాధించవచ్చునంటారు; ఆ విధంగా ప్రజలు నమ్మేటట్లు చేయ యత్నిస్తారు. ఇదంతా అబద్ధం: మోసం, "కమ్యూనిస్టు ప్రణాళిక"లో మార్క్స్, ఎంగెల్స్‌లు రకరకాలైన "సోషలిజం" వ్యాప్తిలో ఉన్నాయని చెప్పారు: పెటీ బూర్జువా "సోషలిజం", బూర్జువా "సోషలిజం", ఫ్యూడల్ "సోషలిజం" వగైరా. ప్రస్తుతం, మార్క్సిజం– లెనినిజం సాధించిన విజయాల ఫలితంగాను, పెట్టుబడిదారీ వ్యవస్థ శిథిలమవుతూన్నందున అనేక దేశాల్లోని ప్రజలు అంతకంతకు అధికంగా సోషలిజం వైపు వస్తున్నారు. కొన్ని దేశాల్లోని దోపిడీ వర్గాలలో "సోషలిజం" అని పిలువబడే రకరకాల ధోరణులు తలయెత్తుతున్నాయి. ఎంగెల్స్ చెప్పినట్లు, "సోషలిస్టులు" అని పిలువబడే యీ బృందం కూడా "పెట్టుబడులు, లాభాలు చెక్కుచెదరకుండా, తమ సర్వరోగ నివారిణులతో సాంఘిక జాడ్యాలను నిర్మూలించగోరుతారు. వీరు కార్మికోద్యమానికి దూరంగా ఉంటారు; 'విద్యావంతుల' అండకోసం ప్రాకులాడతారు." ("కమ్యూనిస్టు ప్రణాళిక జర్మన్ కూర్పుకు ఉపోద్ఘాతం:" మార్క్స్, ఎంగెల్స్‌ల సెలక్టెడ్ వర్క్స్ 1958 మాస్కో ప్రచురణ: మొదటి సంపుటి, 31న పేజీ). వారు "సోషలిజం" అనే అక్షరాలుగల ఒక సైన్ బోర్డును మాత్రం తగిలించుకొని, ఆచరణలో పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో… మార్క్సిజం– లెనినిజం బోధించే విప్లవ సూత్రాల మీద గట్టిగా నిలబడియుండడం, విప్లవ సిద్ధాంతాలను దిగజార్చే ధోరణులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా, ఆధునిక రివిజనిజానికీ, మితవాద అవకాశవాదానికీ వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరపడం ఎంతేని అవసరం.

"ప్రపంచ శాంతిని కాపాడే సమస్యపై కూడ కొందరు సిద్ధాంత వివాదాలు ఈరోజున అవసరం లేదనీ, కమ్యూనిస్టులకూ మితవాద సోషలిస్టులకూ మధ్య మూలసూత్రాల్లో భేదమేమీ లేదనీ అభిప్రాయపడుతున్నారు. దీని అర్థం, కమ్యూనిస్టుల సిద్ధాంత–రాజకీయ ప్రమాణాలను బూర్జువా, మితవాద సోషలిస్టు ప్రమాణాల స్థాయికి దిగజార్చడమన్నమాటే. ఇట్టి అభిప్రాయాలను ప్రకటించేవారు ఆధునిక రివిజనిజం ప్రభావానికిలోనైన వారు; మార్క్సిస్టు–లెనినిస్టు దృక్పథాన్ని విడిచి పెట్టినవారూను.

శాంతి కోసం జరిగే పోరాటం, సోషలిజం కొరకు జరిగేదీ వేర్వేరు పోరాటాలు, ఈ రెండు పోరాటాల మధ్యనున్న వ్యత్యాసాన్ని చూడకపోవడం పొరబాటు. శాంతి ఉద్యమంలో పాల్గొనేవారి సామాజిక హోదాలు విస్తృతమైనవి. బూర్జువా శాంతివాదుల్ని కూడా అది యిముడ్చుకొంటుంది. కమ్యూనిస్టులమైన మనం ప్రపంచ శాంతిని కాపాడ్డంలో, సామ్రాజ్యవాద యుద్ధాలను ప్రతిఘటించడంలో, శాంతియుత సహజీవనాన్ని బలపరచడంలో, అణ్వాయుధాలను వ్యతిరేకించడంలో అందరికంటే ముందుంటాం. ఈ ఉద్యమంలో మనం అనేక సంక్లిష్ట సామాజిక గ్రూపులతో కలిసి పనిచేయవలసి యుంటుంది; శాంతిని కాపాడ్డానికి కొన్ని ఒప్పందాలు కుదుర్చుకోవలసి యుంటుంది. అదే సమయంలో కార్మికవర్గ పార్టీ మూలసిద్ధాంతాలను బలపరచవలసి యుంటుంది; మన రాజకీయ, సిద్ధాంత ప్రమాణాలను ఏ మాత్రం దిగజార్చకూడదు; శాంతిని కాపాడ్డానికి మనం జరిపే పోరాటంలో బూర్జువా శాంతివాదుల స్థాయికి దిగజారకూడదు. ఇక్కడే ఐక్యత, విమర్శ అనే సమస్య ఉత్పన్నమవుతుంది.

ఆధునిక రివిజనిస్టులు సామ్రాజ్యవాదుల యుద్ధసన్నాహాలను కప్పిపుచ్చడానికి "శాంతి" అనే మాటను ఉపయోగిస్తారు; లెనిన్ ఏనాడో ఖండించిన "నవీన సామ్రాజ్యవాదాన్ని" సమర్థిస్తారు: విభిన్న సామాజిక వ్యవస్థలకు చెందిన దేశాల మధ్య శాంతియుత సహజీవనం అవసరమనే కమ్యూనిస్టు విధానాన్ని వక్రంగా చిత్రిస్తారు; శాంతియుత సహజీవనమూ, వివిధ దేశాల్లో ప్రజావిప్లవాలు రాకుండా చేయడమూ ఒకటేనన్నట్లు చిత్రిస్తారు. పాత రివిజనిస్టు బెర్న్‌స్టీన్ సిగ్గువిడిచి, అప్రతిష్టాకరమైన యీ క్రింది ప్రకటన చేశాడు : ఉద్యమమే సమస్తమూను. అంతిమ లక్ష్యం లేదు''. ఆధునిక రివిజనిస్టులు కూడ యిలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నారు. శాంతి ఉద్యమమే సమస్తమూననీ, అంతిమ లక్ష్యం లేదనీ వారి అభిప్రాయం. అందుచేత, వారు కావాలంటున్న "శాంతి" కొన్ని చారిత్రక పరిస్థితుల్లో సామ్రాజ్యవాదులకు కూడ ఆమోదయోగ్యమైనదై యుంటుంది. వారు కోరే "శాంతి" వివిధ దేశాల్లోని ప్రజల విప్లవ ప్రమాణాలను దిగజారుస్తుంది; వారి విప్లవ సంకల్పాన్ని నాశనం చేస్తుంది.

## 6

మనమొక గొప్ప యుగంలో, నూతన యుగంలో నివసిస్తున్నాం. సామ్రాజ్యవాద వ్యవస్థ మరింత త్వరితంగా కూలిపోతూంది; యావత్ప్రపంచంలో ప్రజలు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు; వారి చైతన్యం నిరంతరం అభివృద్ధి చెందుతూంది.

వివిధ దేశాల్లోని ప్రజలీరోజున చాలా అనుకూలమైన పరిస్థితుల్లో ఉన్నారు. ఇంత అనుకూలమైన పరిస్థితి యిదివరకెన్నడూ లేదు. అక్టోబరు విప్లవం తర్వాత, గత నలభై మూడు సంవత్సరాల్లో ప్రపంచ జనాభాలో మూడవ భాగం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం నుంచి విముక్తిచెంది, సోషలిస్టు ప్రభుత్వాలేర్పరచు కున్నారు. అక్కడ సుస్థిరమైన ఆంతరంగిక శాంతి స్థాపింపబడింది. వారు తను ప్రభావాన్ని మొత్తం మానవ జాతి మీద ప్రసరింపజేస్తున్నారు; ప్రపంచమంతటా సర్వవ్యాపిత సుస్థిర శాంతి వర్ధిల్లేరోజు యింకా త్వరితంగా వచ్చేటట్లు వారు కృషిచేస్తారు.

సోషలిస్టు దేశాలన్నిటికి ముందుండి నడుస్తున్న దేశం సోవియట్ యూనియన్, కార్మిక కర్షకులు లెనిన్, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వం క్రింద స్థాపించుకొన్న మొట్టమొదటి సోషలిస్టు రాజ్యమిదే. లెనిన్ ఆశయాలు సోవియట్ యూనియన్లో సిద్ధించాయి; చాలకాలం క్రిందట ఆ దేశంలో సోషలిజం నిర్మింపబడింది. ప్రస్తుతం సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ, కామ్రేడ్ కృశ్చేవ్ ఆధిపత్యం క్రిందనున్న సోవియట్ ప్రభుత్వం నాయకత్వాన చాల విస్తృతమైన కమ్యూనిస్టు సమాజ నిర్మాణం ప్రారంభమవుతోంది. ఎంతో పరాక్రమంగలిగిన, నైపుణ్యం గలిగిన సోవియట్ కార్మికులు, కర్షకులు, మేధావులు కమ్యూనిజాన్ని నిర్మించే మహదాశయం కొరకు బ్రహ్మాండమైన పోరాటం సాగిస్తూ శ్రమవిషయంలో ఒక అద్భుతమైన, నూతనమైన వెల్లువను తీసుకువచ్చారు.

చైనా కమ్యూనిస్టులం, చైనా ప్రజలం అయిన మనం లెనినిజానికి జన్మస్థలమైన సోవియట్ యూనియన్ సాధిస్తున్న ప్రతి విజయాన్ని అభినందిస్తాం.

చైనా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిజం లెనినిజం అను విశ్వ మానవ సత్యాన్ని చైనా దేశపు విప్లవ అనుభవంతో సమన్వయ పరుస్తూ ప్రజా విప్లవంలో గొప్ప విజయాలు లభించేటట్లు దేశ ప్రజలందరినీ నడిపింది: లెనిన్ రూపొందించిన సోషలిస్టు విప్లవ మార్గంలోను, సోషలిస్టు నిర్మాణ పథంలోను అనుగమించింది: సోషలిస్టు విప్లవాన్ని పూర్తిచేసి, సోషలిస్టు నిర్మాణంలో అద్భుతమైన విజయాలను సాధించడం ప్రారంభించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ లెనిన్ సిద్ధాంతాల కనుగుణ్యంగా చైనా దేశ పరిస్థితులకు తగినట్లు సోషలిజాన్ని నిర్మించే విషయంలో అనుసరించవలసిన సాధారణ పంథాను సృజనాత్మకమైన పద్ధతిలో చైనా ప్రజల ముందుంచింది. దాని ప్రకారం నెలకొల్పబడిన

ప్రజాకమ్యూన్లు, వివిధ రంగాల్లో సిద్ధించిన పురోభివృద్ధి దేశవ్యాపితంగా ప్రజలందరిలో విప్లవ చైతన్యాన్ని, చొరవను ప్రోత్సహించాయి. ఈ విధంగా రోజూ మన దేశంలో సరికొత్త మార్పులు జరుగుతున్నాయి.

లెనినిజం అనే సమిష్టి పతాకం క్రింద తూర్పు యూరపులోని, ఆసియాలోని సోషలిస్టు దేశాలు కూడ సోషలిస్టు నిర్మాణంలో అద్వితీయమైన అభివృద్ధిని సాధించాయి.

లెనినిజం ఎల్లప్పుడూ విజయాలను సాధించి తీరుతుంది. యావత్ ప్రపంచంలోని కష్టజీవులు దీని అండను ముందుకు నడుస్తున్నారంటే అర్థం, సత్యాన్ని ఆధారంగా చేసుకొని, వరుసగా అనేక విజయాలను సాధించే మార్గంలో నడుస్తున్నారన్న మాట.

లెనిన్ మన హృదయాల్లో శాశ్వతస్థానం అలంకరిస్తాడు. ఆధునిక రివిజనిస్టులు ప్రపంచ కార్మికుల పతాకమైన లెనినిజాన్ని వక్రంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, మన కర్తవ్యం దాన్ని సక్రమంగా చిత్రించి పటిష్ఠ మొనర్చడం.

ప్రపంచంలో అనేక పీడితవర్గాలకు చెందిన ప్రజలు విముక్తికై జరిపిన పోరాటాల్లో చాలమంది విప్లవ మేధావులు, విప్లవ నాయకులు ప్రముఖమైన పాత్ర వహించారు, కానీ తర్వాత వారి ఉపదేశాలకు అనేక వక్రభాష్యాలు బయల్దేరాయి.

ఈ విషయాన్ని లెనిన్ తన "రాజ్యాంగ యంత్రం, విప్లవం" అను గ్రంథంలో వివరించారు. ఈ వక్రభాష్యాలు "ఆ విప్లవ ప్రభోదాల్లోని సారాంశాన్ని నిర్వీర్యమొనర్చాయి: విప్లవతత్వాన్ని నాశనంచేసి అభాసుపాల్జేశాయి" అన్నారు; ఇంకా యిలా వ్రాశారు:

"ప్రస్తుత సమయంలో బూర్జువావర్గం, కార్మికోద్యమంలోని అవకాశవాదులు కలిసి మార్క్సిజాన్ని యీ విధంగా "చికిత్స చేయడం" కనిపిస్తుంది. దాని బోధల్లోని విప్లవాంశను విప్లవాత్మకను విడిచిపెట్టడమో, తుడిచివేయడమో, వక్రంగా చిత్రించడమో చేస్తున్నారు. బూర్జువా వర్గానికి ఆమోద యోగ్యమైనదాన్ని ముందుకు త్రోసి, గొప్పగా స్తుతిస్తున్నారు." ("రాజ్యాంగ యంత్రం : విప్లవం": సెలక్టెడ్ వర్క్స్-1952 మాస్కో ప్రచురణ; రెండవ సంపుటి, మొదటిభాగం, 202వ పేజీ)

సరిగా యిలాగే యీ రోజున కూడా జరుగుతోంది. అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రతినిధులు కొందరు మళ్లీ ధర్మబోధకుల వేషంలో తయారై మనకెదురుగా నిలుస్తున్నారు. వారు మార్క్సుని "19వ శతాబ్దపు గొప్ప భావుకుడు" అని స్తుతిస్తున్నారు: పెట్టుబడిదారీ విధానం పతనమై తీరుతుందని మార్క్సు చెప్పిన జోస్యం "సరియైనది" అనీ "చక్కని ఆధారం గలది" అని మెచ్చుకుంటున్నారు. కాని, 20వ శతాబ్దం ప్రారంభమైన తర్వాత, ముఖ్యంగా ఇటీవలి దశాబ్దాల్లో, మార్క్సిజం సరియైనది కాదంటున్నారు. కారణం, పెట్టుబడిదారీ విధానం మాయమై పోయిందట. కనీసం అమెరికాలో దానికి అస్తిత్వం లేదట. ఈ సామ్రాజ్యవాద బోధకులు చెప్పే చెత్త అంతా విన్న తర్వాత, ఆధునిక రివిజనిస్టులు కూడ వారి భాషే మాట్లాడుతున్నారనిపించక మానదు. కానీ ఆధునిక రివిజనిస్టులు మార్క్సు ఉపదేశాలను వక్రంగా చిత్రించడంతోనే ఆగరు; మార్క్సిజాన్ని అభివృద్ధి చేసిన లెనిన్ ఉపదేశాలను కూడ వారు వక్రంగా చిత్రిస్తారు.

మాస్కో సమావేశం "నేటి ముఖ్య ప్రమాదం రివిజనిజం: లేక మితవాద అవకాశవాదం", అని ప్రకటించింది. ఈ ప్రకటన ప్రస్తుత పరిస్థితులకు వర్తించదని కొందరంటారు. అది పొరపాటని మా అభిప్రాయం, ముఖ్య ప్రమాదమైన రివిజనిజంపై జరపవలసిన పోరాట ప్రాముఖ్యతను యిది తగ్గించి వేస్తుంది; అందుచేత శ్రామిక విప్లవానికి చాలహాని కలుగజేస్తుంది. 1870 ప్రాంతం నుండి పెట్టుబడిదారీ విధానం "శాంతియుతంగా" అభివృద్ధి చెందింది; ఆ దశలోనే బెర్న్‌స్టీన్ నాయకత్వం క్రింద పాత రివిజనిజం ఉద్భవించింది. అదేవిధంగా సామ్రాజ్యవాదులు శాంతియుత సహజీవనాన్ని అంగీకరించక తప్పని పరిస్థితుల్లో అనేక పెట్టుబడిదారీ దేశాల్లో ఒక విధమైన "ఆంతరంగిక శాంతి" ఏర్పడ్డ పరిస్థితుల్లో రివిజనిస్టు పోకడలు సులభంగా ఉత్పన్నమై వ్యాపిస్తాయి. కాబట్టి మనం కార్మికోద్యమంలోని – యీ ముఖ్య ప్రమాదం పట్ల ఎల్లప్పుడు అప్రమత్తులమై మెలగాలి.

లెనిన్ శిష్యులమైన మనం, లెనినిస్టులమైన మనం లెనిన్ – ఉపదేశాలను వక్రంగా చిత్రించేందుకు ఆధునిక రినిజనిస్టులు చేసే ప్రయత్నాలను పూర్తిగా భగ్నంచేయాలి.

లెనినిజం సంపూర్ణమైన, సమగ్రమైన శ్రామికవర్గ విప్లవ ప్రబోధం. సంపూర్ణమైన, సమగ్రమైన విప్లవ ప్రపంచ దృక్పథం. మార్క్సు ఎంగిల్స్ అడుగులతో అనుగమిస్తూ శ్రామికవర్గం యొక్క ఆలోచనలను అది ముందుకు తీసుకెళ్తుంది. ఈ సంపూర్ణమైన సమగ్రమైన విప్లవ దృక్పథం వక్రంగా చిత్రింపబడకూడదు. ఆధునిక రివిజనిస్టులు లెనినిజాన్ని వక్రంగా చిత్రించేందుకు చేస్తున్న ప్రయత్నాలు, తమ అస్తిత్వాన్ని నిలుపుకొనేందుకు సామ్రాజ్యవాదులు జరుపుతున్న ఆఖరు పోరాటమని మా అభిప్రాయం. సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు నిర్మాణం ఎడతెగకుండా అనేక విజయాలు సాధిస్తున్నప్పుడు, సోషలిస్టు దేశాల్లో సోషలిస్టు నిర్మాణం అద్భుతమైన విజయాలు సాధిస్తున్నప్పుడు, సోవియట్ యూనియన్ నాయకత్వం క్రింద సోషలిస్టు శిబిరం యొక్క ఐక్యత రోజురోజుకు పెరుగుతూన్నప్పుడు; అంతకంతకు చైతన్యవంతులవుతున్న ప్రపంచ ప్రజలు పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదపు శృంఖలాల నుండి విముక్తి చెందేటందుకు దృఢ నిశ్చయంతోను, సాహసోపేతంగాను పోరాడుతున్నప్పుడు టిటో బృందం చేసే రివిజనిస్టు ప్రయత్నాలు పూర్తిగా విఫలమవుతాయి.

**లెనినిజం చిరస్థాయి అగుగాక**

* * * * *